

# పాపం అంజలి

ఉషాలావణ్య

అర్థరాత్రి వేళ. నిశీథి నిశ్శబ్దపు అడుగుల చప్పుళ్ళు చెంతనే నిలిచి గుసగుసలు పోతున్నట్లు, శ్వాశ నిశ్వాసాలు బరువెక్కి గుండె వాకిళ్ళు రెపరెపలాడినట్లు సుదూర తీరాన విచ్చుకుంటున్న ఇంద్రధనుస్సు కాంతులు కనురెప్పలపై చిట్టి గంతులు వేస్తున్నట్లు ఒక వింతైన, ఇరుకైన అనుభూతి. నిద్ర కాని నిద్రతో అశాంతిగా అటు ఇటు దొర్లి దొర్లి చటుక్కున లేచి కూర్చుంది అంజలి. గొంతెండి పోయినట్లు వుంది. తరచూ ఎదురయ్యే అనుభవం. సాధ్యం కాని పరిష్కారం. ప్రయత్నమే ఉండని కర్మ యోగం!

మంచి నీళ్ళు తాగుదామని కిచెన్ వైపు వెళ్తూ ఒక అసంకల్పిత చర్యలా బార్లా తెరిచి పెట్టి వున్న వీధి గుమాన్ని చూసి ఆగిపోయింది. ఇదేమిటి? వేళగాని వేళలో ఎవరు తెరిచినట్లు? తమ్ముడు ఇంటర్ కాలేజీమేట్ స్పోర్ట్స్‌కు వెళ్ళి వారం అయింది. తండ్రి ఏ పన్నెండింటికో సారా కొట్టు కట్టేసి గాని రాదు. మరీ పూట వచ్చాడో లేదో! అమ్మేదీ? ధైర్యం తెచ్చుకుని ఇల్లంతా లైట్లు వేసి వెతికింది 'అమ్మా అమ్మా' అని పిలుస్తూ. ఎక్కడా లేదు. ఎటు వెళ్లినట్లు. అదీ ఇంత రాత్రి వేళ చెప్పకుండా వెళ్ళాల్సిన అవసరం ఏముంది?

డాడీ వచ్చినట్టా రానట్టా? మనసేదో కీడును శంకింస్తోంది...భయపడుతూనే వీధి గుమ్మంలోకి వచ్చి అటు ఇటు చూసింది. దూరంగా...వీధిలైట్ల వెలుగులో స్టేషన్ వైపు వెళ్తున్న ఆకారం...నాన్నే?! అవును!! చప్పున చెప్పులు తొడుక్కుని పక్కన పడేసిన చున్నీని భుజాన వేసుకుని తనూ అతడి వెంటే బయల్దేరింది చప్పుడు చేయకుండా. ప్లాట్‌ఫారం మెట్లెక్కాక, నిర్మానుష్యంగా వున్న చివరి సిమెంట్ బెంచీ మీద వెలగాలా వద్దా అన్నట్లు వెలుగుతున్న దీపం వెలుగులో ఆక స్త్రీ మూర్తి ఆకారం అమ్మ!! ఎక్కడికి వెళ్ళాలనుకుంటోంది? ఎవరికీ చెప్పకుండా ఒంటరిగా గడప దాటిందంటే...చెట్ల నీడల వెంట ఎవరికీ కనిపించకుండా జాగ్రత్త పడుతూ సమీపంగా నిలబడింది.

"ఏం పనిది? ఇలా ఇల్లు వదిలి వచ్చేస్తే ఏంటర్థం?" నాన్న కరుకు కంఠం.

మౌనంగా కొంగుతో కళ్ళద్దుకుంటున్న అమ్మ.

"చేసేవన్నీ వెధవ పన్లు. అయినా అంత కాని మాట ఏమన్నానని?"

విసుగు కోపం రంగరించుకున్న కంఠంలో మరింత కోపం.

"ఇంకొక్క మాట మీరినా ఒప్పుకోను. నీకు నాకు సంబంధం లేదని చెప్పే వచ్చేసింది. వయసొచ్చిన పిల్లని ఇంట్లో పెట్టుకుని చేసే పన్లు అనే మాటలా?"

"ఏమన్నాననట. ఉన్న మాటంటే అంత ఉలు కెందుకు? అయినా?..."

"చాల్చాలు. ఇక నీకు నేనేం కాను. నువ్వేలా సంపాదిస్తావో...ఏం చేస్తావో నీ యిష్టం. నేను మా అమ్మ దగ్గరికే వెళ్ళిపోతాను. రోజు తాగి రావటం నోటికొచ్చిందల్లా వాగటం. వావివరసల్లేకుండా బతకటం నీకు అలవాటేమో! నాకా అవసరం లేదు. ప్రతి పూటా నీతో మాటలు పడుతూ ఇక్కడే పడుండాల్సిన అవసరం అంతకంటే లేదు" ఖచ్చితంగా చెప్పేసింది.


ఏదో ప్యాసింజరు వచ్చి ఆగటం...అమ్మ ఎక్కేయాలని హడావుడి చేయటం స్పష్టంగా కనిపిస్తోంది.

"లేదులే...లేదు ఇంకెప్పుడూ ఇలా జరగదు. నమ్ము.ముందు ఇంటికి పద. అక్కడ మాట్లాడుకుందాం!" మత్తు దిగిపోయుండాలి. లేదూ...అందితే జుట్టు అందకపోతే కాళ్ళు అన్న అలవాటు కావచ్చు. దీనంగా అతి హీనంగా ప్రాధేయపడుతున్నాడు. అమ్మ మరింత కోపంగా పెనుగులాడుతోంది. ఇదంతా రోజూ ఉండే భాగోతమే! గట్టిగా నిట్టూర్చి వడివడిగా అవే నీడల్ని అంటిపెట్టుకుని తిరిగి వచ్చేసింది అంజలి. తలుపులు వారగా మూసైతే పడుకుంది గానీ టకటక కొట్టుకునే తలుపుల వాకిళ్ళనేం చేయటం? పరిపరి విధాలయిన ఆలోచనలు! ఆవేదనతో ఆవేశంతో వ్యధల పొదలతో హోరెత్తి పోతున్న అంతరంగం.

అష్టాదశ అధ్యాయాల 'గీత' అష్టాదశ వర్షాలు నిండిన తన నుదుటి గీత!

ఒక వసంతం నుంచి మరో వసంతం వరకు పయనం ముగించుకుంటూ సాగించిన జీవన యాత్రలో ఎన్నో ఉదయ సంద్రాలు. ఎన్నెన్నో సాయం సంధ్యల అలల పొంగులు. గాలి వీద్పుల మధ్య పడి లేస్తూ ఎగిసి పడే అలల్లా ఏ నిట్టూర్పుల పొగలు సాంసారిక తాపత్రయ మయమైన వేడి సెగలు అంటని తీరంలా ఏకాంత ప్రశాంత నిశీథి నీడల్లో ఒదిగిపోవాలని అలమటించటేదు? నిరంతరం

## నాగరికత వెల్లువ



**తూరుపు రేకలు**
**పురుడు పోసుకోక ముందె**
**పల్లెలు ఆవులించి**
**మేలుకుంటున్నాయి**
**ముఖ ప్రక్షాళనకు ముందుగానె**
**పల్లెల నోళ్ళు**
**తేనీరు సేవిస్తాయి**
**పట్నాల గొంతు తడిపేందుకు**
**పల్లెలు కామధేనువులౌతాయి**
**వీధులు రచ్చబండలు**
**రాజకీయాలు చర్చించుకుంటాయి**
**తులసి కోటల ప్రదక్షిణాలు లేవుకాని**
**కుళాయి లడాయిలుంటాయి**
**విశ్రాంత సమయాల్లో**
**అవిశ్రాంతంగా కేబుల్ టీవీకి**
**మెదళ్ళు వలసలు పోతుంటాయి**
**చేపల చెరువులతో, ఇళ్ళ కట్టడాలతో**
**పత్రహరితం హరించుకు పోయి**
**పల్లెతనం మాయం**
**నాగరికత వెల్లువ ప్రవహించి**
**పల్లె ప్రశాంతత**
**ఖతమగుట ఖాయం**

– బద్ది నాగేశ్వరరావు

తపిస్తూ...జపిస్తూ...పరితపించిపోలేదు! పొగమంచు మబ్బుల భూపాల రాగ మూర్ఛనలు ఎప్పుడైనా...ఏ చిన్న సందేశాన్నయినా... అందించకపోతాయా అని, రాత్రి చెక్కిట ప్రకృతి చెక్కిన హిమ బిందువుల గుర్తులు సైతం చీకట్ల వ్యధలనన్నింటిని లోలోపల దిగమింగి, పగటి ముంగిట వెలుగుల రవ్వలు నింపి, గరిక రెమ్మల కొసల్ని వినిపించే జలతరంగిణి నాదాలు ఒక చిన్న మార్పుకైనా వేదికలు కాకపోతాయా అన్న ఆశతోనే జీవితం గడిపేస్తూ...వేదనలతోనే విసిగి వేసారిపోతూ... 'అంజుతల్లి' అంజలి అయింది, అంజలి అంజలీదేవి అయింది. అంజలీదేవి అంజలి గారుగా గుర్తింపు పొందింది. అయినా ఏ అనుభూతీ అంటని గుండె! ఇప్పుడిక అమ్మ వారసత్వాన్నే అంది పుచ్చుకుని అంజలిగారు క్రమేపి అంజలమ్మగారు...అంజమ్మగారుగా మారి కడకు "అంజమ్మో అంజవ్వగా మిగిలిపోతుందేమో! ఈ మొత్తం ప్రక్రియలో ఒకప్పుడు గుండెల నిండా ప్రేమే! ప్రేమ తప్ప మరేదీ లేని స్థితి. మరేదీ తెలియని మనస్థితి! ఆ స్థితి నుంచి 'మనిషి' అన్న ప్రతి మనిషి పట్ల పెంచుకున్న ప్రేమాభిమానాలు నమ్మకాలు వమ్మైపోయి...కసి...కోపం...ద్వేషం...మాత్రమే మిగిలిపోతాయి. పరిస్థితులు సృష్టించే అలజడుల దుర్గంధ భూయిష్టమైన మనసులోని రోతని రొచ్చును అసహ్యించుకుంటూ స్వచ్ఛమైన గాలిని రమ్యమైన వెలుగులను వాటిలోని ఆనందానుభూతిని ఘడియ పాటైనా ఆస్వాదించగలిగే ఘడియ కోసం ఎదురు చూస్తూనే గడపవలసి రావటం...ఎవరిది తప్పు? మనిషిదా...మనిషిని కీలు బొమ్మను చేసి ఆడించే ప్రకృతిదా? ఎందువల్ల ఇలా జరుగుతుంది? తను ఎంతో ఆర్తితో ఘటించిన అంజలి తిరస్కారాల పాలెందుకయింది? అనుభవించిన వేదన అంతా వ్యర్థమైన వేద ఘోషగా ఎందుకు మిగిలింది? ప్రతి మనిషి చుట్టూ ఒక మాయా వలయం ఉండే తీరుతుంది! "ఏంటి అంజలి ఈ మధ్య ఆ శివకుమార్తో ఎక్కడంటే అక్కడే తిరుగుతోంది?..."

"నీకంటే వయసైపోయింది. ఏం చేసినా చెల్లుద్ది! దాన్నీ నీలాగే తయారు చేశావంటే..." లతో మొదలయ్యే ఆరోపణాస్త్రాలు "మనం గర్భాదానం చేయాల్సింది పోయి అదే ఏదో అఘాయిత్యం చేస్తే తీరిగ్గా కూర్చుని ఏడ్వాల్సి వస్తుంది. ఇలాంటి పరువు తక్కువ పన్లు చేస్తే సహించేది లేదని నా మాటగా చెప్పు! అదుపులో ఉంచుకోవాల్సిన వయసుని ఆరబోస్తే లోకం హర్షించదు"తో పరాకాష్ఠకు చేరుకుని..."ఏదీ అది? చంపేస్తాను..." అంటూ రంకెలు మొదలయి, తన ఉనికినే ఒక ప్రశ్నార్థకంగా మార్చబోతుంటే ఎదురు తిరగక తప్పక...ఎదుటకు వచ్చి నిలబడింది అంజలి.

"శంకర్ నా క్లాస్‌మేట్ నాన్నా!"

"అతనేనా తల్లీ? ఇంకెవరూ లేరా?"



# దీప దేవత - ఫ్లోరెన్స్ నైటింగేల్

“ఆశయం సమున్నతమయితే లోకం ఏమనుకున్నా లెక్క చెయ్యాల్సిన అవసరం లేదు. చిత్తశుద్ధితో కృషి చేస్తే లోకమే పాదాక్రాంతమవుతుంది” అక్షరాలా ఈ లోకోక్తిని ఆచరణలో పెట్టిన స్త్రీమూర్తి ఫ్లోరెన్స్ నైటింగేల్.

ఈమెకు “లేడీ విత్ ది లాంప్” అనే నానుడి సార్థక నామధేయమయింది.

1854 సంవత్సరం. క్రిమియాలో యుద్ధం చెలరేగింది. ఫ్రాన్స్, ఇంగ్లాండ్‌లు రెండూ కలిసి రష్యాతో పోరాటానికి తలబడ్డాయి. వేలాది బ్రిటిష్ సైనికులు గాయాల పాలబడ్డారు. వందలాది మరణించారు. ఆ సంవత్సరం 38 నర్సులతో నైటింగేల్ టర్కీకి ప్రయాణమయ్యారు. శవాలు గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. 4 మైళ్ల పొడవునా గాయపడిన సైనికులు పడి ఉన్నారు. సముద్రం దుర్గంధపూరితమైంది. కలరా విజృంభించింది. మొండేలు, కాళ్లు చేతులు ఎక్కడ పడితే అక్కడ పడి ఉన్నాయి.

ఈ పరిస్థితుల్లో నైటింగేల్ తన నర్స్ కార్యక్రమానికి పూనుకొంది. ఇందులో వింత ఏముంది అనుకుంటారా? నర్స్ అంటే దేవతామూర్తి కదా. అవును. కాని ఈ భావనను మానవుల దృక్పథంలో ప్రప్రథమంగా కల్పించినది ఈమె.

1820 మే 12న ఇటలీలోని ఫ్లోరెన్స్‌లో ఈమె జన్మించారు. కాని స్వతహాగా బ్రిటిష్ పౌరురాలు. జన్మనెత్తిన నగరానికి గుర్తుగా ఆమె ఫ్లోరెన్స్‌గా ప్రసిద్ధికెక్కారు. ఆర్థికంగా ఉన్నత స్థాయికి చెందినవారు. సమాజంలో ఉన్నత శిఖరాలనందుకొన్నవారు. ఇక అందంలో అప్సరస. అయితేనేం నర్సు కావచ్చు కదా.

మరి ఇది చూడండి. నర్స్ అంటే ఆ రోజుల్లో ఎలాంటి భావాలుండేవి. సమాజం నర్సులను పురుగులుగా చూసేది. వారు తాగుబోతులు, వ్యభిచారులు. సమాజంలో అధములు. ఇక ఆస్పత్రులు చీకటి గుహలు. అనారోగ్యానికి ఆనవాళ్లు. పై లోకానికి రహదారులు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ఏ తల్లిదండ్రులు బిడ్డను నర్స్‌గా పంపుతారు. అందులో వారు ఆగర్భ శ్రీమంతులు!

కాని ఆమె రంగంలో దిగి, తిండి మాని సైనికుల బాధలను, కష్టాలను పట్టించుకొని రాత్రుళ్లు సైతం చేతిలో దీపం ఉంచుకొని రోగులను పరామర్శించేవారు. ఆమె కనబడితే చాలు రోగం పోయి ఆరోగ్యం సమకూరినట్లుగా భావించుకొనేవారు. ఆమె నీడను ముద్దాడేవారు. ఆమెకే లేడీ విత్ ది లాంప్ అనే కీర్తి సమకూరింది.

యుద్ధ శిబిరాల నుంచి తిరిగి వచ్చిన నైటింగేల్‌కు విక్టోరియా రాణి స్వయంగా స్వాగతం పలికారు.

1859లో నైటింగేల్ “నోట్స్ ఆన్ నర్సింగ్” ప్రచురించారు. ప్రపంచంలో ప్రథమంగా నర్సుల శిక్షణకు కాలేజి స్థాపించారు. నర్స్ అనే పదానికి దేవతామూర్తి అనే భావన కల్గించినవారు ఆమె.

నర్స్ వృత్తి, ఆస్పత్రుల నిర్మాణం, నిర్వహణ రోగుల జాగ్రత్త వంటి వాటిలో ఎంతో పరిశోధన చేసి అనూహ్య రీతిలో నిబంధనలు రూపొందించి ప్రపంచానికే మార్గదర్శకురాలయ్యారు.

ఆనాటి భారత ప్రభుత్వానికి సైతం తమ లేఖల ద్వారా ఎన్నో సూచనలు చేశారు.

జీవిత చరమాంకంలో చూపు కోల్పోయిన నైటింగేల్ 90 వ ఏట 1910 ఆగస్టు 13న కన్ను మూశారు. వీలునామా ప్రకారం ఆమె అంత్యక్రియలు సాదాసీదాగా జరిగాయి.

ప్రస్తుతం ఆమెకు సంబంధించిన వస్తువులన్నీ ఒకచోట సమకూర్చి లండన్‌లో “ఫ్లోరెన్స్ నైటింగేల్ మ్యూజియమ్”ను ఏర్పాటు చేసారు.

మధ్య లండన్‌లో సెయింట్ థామస్ హాస్పిటల్‌లో వెలిసింది. దానిలో ఫ్లోరెన్స్ నైటింగేల్‌కు చెందిన వస్తు సముదాయం పొందుపరిచారు. వాటిలో చాలా వస్తువులను ఎవరూ ఇంతవరకు గమనించనేలేదు.

ఇపుడు ఆ అవకాశం అందరికీ లభ్యమవుతోంది.

ఆమె పెంపుడు పక్షి ఒక గుడ్లగూబ. దానిని స్టఫ్ చేసి ఉంచారు. ఒక హితవు సముదాయింపు ఉండే ఉత్తరం. ఇక ఆమె చేతిలో తిరుగాడిన అదృష్టవంతమైన చరిత్రాత్మకమైన దీపం... ఇలా ఎన్నో.

టర్కీలోని స్కుటారీ ఆసుపత్రికి ఆమె చేరిన చరిత్రాత్మక దినానికి 150 సంవత్సరాలు నిండాయి. ఆ సంఘటనను పురస్కరించుకొని ఈ మ్యూజియమ్ ఏర్పాటు అవుతోంది.

**- జమ్మి కోనేటిరావు**

---

“ఫీల్డు వర్కున్నప్పుడు పదిమందిమి కల్సి తిరగాల్సి ఉంటుంది. దానికి రంగులు పులమటం నీకలవాటే కదా!”

“ఆహా! ఎక్కడమ్మా ఆ ఫీల్డు వర్కు...సుదర్శన్ హోటల్లోనా, పబ్లిక్ పార్కుల్లోనా? ఎక్కడట?”

“ఫ్రెండ్సున్న తర్వాత కాఫీ తాగటం తప్పని వివేకం వున్న వాడెవడూ అనడు.”

“ఎందుకవుద్ది? కాదు! అది నువ్వు కట్టుకునే వాడే అయితే ఎవడికీ ఏ అభ్యంతరమూ ఉండదు. అయిన వాడితో కాని వాడితో అడ్డమైన చోట్లు తిరుగుతుంటే మాత్రం అది బరితెగించటం అంటారు. స్నేహం అనరు...”

“నాన్నా!” కోపంగా వారిస్తున్నట్లు అంది.

“ఎందుకు అరవటం? పెళ్లి చేస్తాం అని తెచ్చిన వాడెవడూ నీకంటికానడు! అత్తింట్లో గడిపినట్లు ఆ బృందావన్ కాలనీల్లో విహారాలు మాత్రం మానవు. అసలు వాణ్ణే కట్టుకోవచ్చుగా! చెప్పు! ఉంచుకుంటానన్నాడా నిన్ను?”

“శివ! శివ!!” భరించలేనట్టు రెండు చెవులు మూసుకుంది.

మనిషికి దేవుడు నోరిచ్చింది ఇందుకేనా? చిత్తశుద్ధితో పాటు వాక్శుద్ధి ఉండక్కరలేదా?

ఊహ తెలిసిన నాటి నుంచి ఎదురయ్యే

చేదు అనుభవాలే! ఒకర్నొకరు హీనాతి హీనంగా సంస్కార రహితంగా కించపరుచుకోవటం... అవమానించుకోవటం.. అవసరాలు గుర్తుకు వచ్చినప్పుడు మాత్రం అంతా మరిచి పోయి సర్దుకుపోవటం! స్త్రీ, పురుషుల మధ్య ఇంతేనా? ఇంతకు మించి ఇంకేం లేదా? మనిషి మనసులో లోతుల్ని స్పృశించి పరిశీలించిన 'ఫ్రాయిడు' అనుభవాలెటువంటివోగాని తన తండ్రి వల్ల తల్లి, తల్లిదండ్రులవల్ల తను... జీవితంలో ఒక్క చీకటి పక్షాన్నే చూడగలిగారు! మమతానురాగాలకు గౌరవాభిమానాలకు అర్థమే తెలియకుండా బ్రతకాల్సి రావటం... బహుశా... తన తల్లి నుంచి వారసత్వంగా తనకూ సంక్రమించిన గొప్ప నిధి అదే అయుంటుంది.

తల్లిలాగే తనూ ఒక స్త్రీకి ఒకే పురుషుడని భావించింది. దాన్ని ఒక నియమంగా... మౌనంగానే స్వీకరించింది. కాని తన పురుషుడు తనకే స్వంతం కావాలన్న స్వార్థం ఆమెది! ఆ పురుషుడికి తానే సర్వస్వం కావాలనీ మనసారా కోరుతుంది. తల్లిగాని... చెల్లిగాని... ఎవరికెందరున్నా గృహస్థుడైన వాడు గృహిణికే కదా పెద్ద పీట వేసేది? తన తల్లిని తన తండ్రి సమయం దొరికినప్పుడల్లా తూలనాడుతూనే వచ్చాడు. ఆ మహాతల్లి అన్నింటినీ మౌనంగానే భరించింది. తనను అన్యాయంగా తూలనాడుతుంటే మాత్రం... తల్లి వారింపుని సైతం లెక్క చేయకుండా తండ్రిని నిలదీసింది. గర్భదానం!!! స్వీకరించేందుకు స్త్రీ సహకారం ఉన్నప్పుడేగా అది జరిగేది! దాతలమన్న పురుషాహంకారానికి ఎంతకాలం ఇంకా అణిగి మణిగి ఉండాలి? అందుకే ధైర్యంతో ఆ ఇంటి గడప దాటింది. అంతకు మించిన విశ్వాసంతో, ఆత్మస్థైర్యంతో మరో గడప ఎక్కింది. ఆత్మ నివేదనలోనూ దాస్య భావనకే ప్రాధాన్యం లభిస్తుందని గ్రహింపు లేక కాదు. ఒక మాట పుచ్చుకునే హక్కు వున్నదన్న నమ్మకంతోనే తలుపు తట్టింది.

వాకిళ్ళయితే తెరుచుకున్నాయి గానీ అనుకోని రీతిలో ఎదురు చూడని విధంగా ఎదురైన సత్కారానికి కట్రాటే అయింది..."అదేమిటి? రమణి, సుమతి, విమల అందరూ నాకు మంచి ఫ్రెండ్స్! వాళ్ళూ మీరడిగినట్లే అనుకుంటే ఎలా?...రఘు, రామన్, సుమన్, పాంచజన్యం...మనం అందరం కల్సే తిరిగాం కదా! మీకు తెలిసే మీ ఇష్టం మీదే వస్తున్నారనుకున్నానే...! ఏముందండీ మీలో అంతగా నేను మనసు పారేసుకునేదానికి? అసలు మీ మొహం వంకైనా చూశానా? ఎప్పుడైనా ముట్టుకోనైనా ముట్టుకున్నానా...? ఎలా అనుకున్నారు మరి మీరంటేనే ఇష్టం అని? జీవితం అంతా మీతోనే ఉంటానని? కష్ట సుఖాలు పంచుకుంటాననీ?" ఒక్కొక్కమాట ఒక్కొక్క వాడి చురకత్తిలా గుండెల్లో నాటుకుపోతోంది.

గుండె కోరుకున్నది ఒక్క వాగ్దానమే! చెయ్యి చూపింది అది పుచ్చుకునేందుకే... ఉందనుకుంటూ వున్న బంధం ఏదో తెగిపోతుందేమోనన్న ఆతురత అది...అలా జరగదు అన్న ఆశ్వాసన కోసం పడిన తాపత్రయం అది! కాని పెదవి దాటి ఒక మాటా ఉచ్చరించలేదు. ఎత్తిన అడుగు ముందుకు వెయ్యలేదు. అప్పుడు పడింది బ్రహ్మ దేవుడు ఎంతో కాలంగా ఎంతో నేర్పుతో మలచుకుంటూ వచ్చిన బొమ్మపై కాలం 'ఉలి'తో కొట్టిన ఆఖరి దెబ్బ! తగలరాని చోట తగిలిన దెబ్బ! అతి సున్నితమైన సెంటిమెంటు మీద బలంగా పడిన దెబ్బతో...విరిగి ముక్కలయిపోవాల్సిందే...కానీ అంజలి మాత్రం శిలే అయిపోయింది!! కళ్ళకు కట్టిన భ్రమలు..మనసుకు అంటిన మలిన పొరలు..ఒకటొకటిగావీడిపోతున్నట్లుగా..అంత వరకూ ఎన్నడూ తెలియని, ఎవరూ బోధించని పరమసత్యం ఏదో తెలిసివచ్చినట్లే అయింది. గుండెల్లో బడబాగ్నులు చెలరేగుతున్నా, రెప్పల మాటున ఏడేడు సముద్రాలు ఉప్పొంగుతున్నా కాళ్ళు కదిలే శక్తి లేనట్లు మొరాయిస్తున్నా... మౌనంగానే వెనుదిరిగింది.

ఇప్పటికి కోరుకునేది ఒక్కటే...మోసాలు ద్వేషాలు లేని ఒంటరితనంతో నేస్తం కట్టనీ! గుండెలో మిగిలిన కాసింత తడిని తడుముకుంటూ మనిషిగానే మిగలనీ! మనిషిగానే మృతినొందనీ! జీవితంపైన ఇచ్చనే వదులుకోవటం! మోక్ష సంకల్పాన్నే త్యజించటం! అదే మోక్ష సన్యాసం!! కాదా? ❋

## 26 నంబరు మహిమ!

**ప్రపంచంలో 26వ తారీఖున సంభవించిన భూకంపాలు**

| | | | |
|---|---|---|---|
| 2001 | జనవరి | 26 | గుజరాత్ |
| 2001 | సెప్టెంబర్ | 26 | చెన్నై |
| 2002 | డిసెంబర్ | 26 | చైనా |
| 2003 | జనవరి | 26 | న్యూజిల్యాండ్ |
| 2003 | మే | 26 | జపాన్/తైవాన్ |
| 2003 | సెప్టెంబర్ | 26 | జపాన్(హొక్కైడొ) |
| 2003 | అక్టోబర్ | 26 | చైనా(సున్సూ) |
| 2003 | డిసెంబర్ | 26 | ఇరాన్ |
| 2004 | డిసెంబర్ | 26 | ఆగ్నేయాసియా |

- వి.కె. మోహన్

